

రూ.94లక్షల విలువైన మత్తుపదార్థాలు ధ్వంసం 5
పరిశ్రమలో ఊపిరాడక కార్మికుడి మృతి

పోలీసులు శారీరక, మానసిక దృఢత్వం కలిగిఉండడం కీలకం

- సంగారెడ్డి ఎస్పీ రూపేష్
- రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు జిల్లా జట్ల ఎంపిక



కబడ్డీ పోటీలో క్రీడాకారులు

సంగారెడ్డి క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండడం కీలకమని సంగారెడ్డి రూపేష్ అన్నారు. ఈనెల 28న కరీంనగర్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్ కోసం సంగారెడ్డి నుంచి జట్ల ఎంపిక పోటీలను బుధవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్, ఆర్మ్‌డ్ రిజర్వు విభాగాలకు లాంగ్ జంప్, హైజంప్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాగ్‌ఆఫ్‌వార్, షార్ట్ రన్ పోటీలను నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులలో పోలీసింగ్ అనేది చాలా సవాళ్లతో కూడినదన్నారు. అలాంటి చాలెంజ్ లను సమర్థవంతంగా ఎదుర్కొని, ప్రజలకు మెరుగైన సేవలు అందిచాలంటే దృఢంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావే, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రామరావు, రాజశేఖర్‌రెడ్డి, డానియెల్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి ఫతేఖాన్ దర్గా 140వ ఉర్సులో జగ్గారెడ్డి

- ప్రతీ సంవత్సరం ఉర్సుకు వస్తున్నాను : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





సంగారెడ్డిలోని ఫతేఖాన్ దర్గాలో గంధం ఎత్తుకుని వస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రార్థనలు చేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని హజ్రత్ ఫతేఖాన్ సాహేబ్ మజ్జుబ్ రోహేమతుల్లా(ఫతేఖాన్) దర్గా 140వ ఉర్సు ఉత్సవాల్లో బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. దర్గాలోకి గంధం ఎత్తుకుని వెళ్లి చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఉర్సులో ప్రత్యేక ప్రార్థనలు చేయడం వల్ల ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. తాను ప్రతీ సంవత్సరం ఉర్సుకు హాజరవుతున్నానని పేర్కొన్నారు. దర్గా అభివృద్ధి కోసం కృషి చేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు షఫీ, సోహైల్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

కంది/సంగారెడ్డి జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. బుధవారం ఆమె సంగారెడ్డి టౌన్‌తో పాటు కంది మండంలోని కవలంపేటలో, కొండాపూర్ మండలంలోని గంగారంలో నిర్వహించిన గ్రామసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



సంగారెడ్డిలోని రాంనగర్ గ్రామసభలో మహిళలతో కరచాలనం చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్

శోధిస్తూ.. సాధిస్తూ..

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల వినూత్న కార్యక్రమం
'జిజ్ఞాస' ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలు
రోజూ వాడే టూత్ బ్రష్‌పై రీసెర్చ్
కనిపించిన బ్యాక్టీరియా.. నివారణ జాగ్రత్తలపై సూచనలు, సలహాలు

5



ఇంటర్ ప్రాక్టికల్స్‌పై నిఘా

ప్రతీ ప్రయోగశాలలో సీసీ కెమెరాలు
కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం
ప్రతీ కళాశాలకు రూ. 12 వేలు
ఫిబ్రవరి 3 నుంచి పరీక్షలు

5

తూప్రాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఒడిశా బృందం

5



సంగారెడ్డి మండలం ఫసల్‌వాదీ గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

అటు అర్హుల ఎంపిక.. ఇటు అర్జీలు

జాబితా ఆమోదించాల్సిన గ్రామసభల్లో ఎక్కడ చూసినా దరఖాస్తుల వెల్లువ

గ్రామసభల్లో అటు అర్హుల ఎంపిక జరుగుతుండగా.. మరోవైపు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. ఎక్కడ చూసినా జాబితాలో తమ పేర్లు లేవంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు అధికారులకు మొర పెట్టుకోవడం కనిపించింది. నిరాశ వద్దని.. పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. దీంతో మరోసారి గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి.

- పేర్లు రాలేవని అధికారులకు మొర
- ఆందోళన వద్దని.. మళ్లీ అర్జీ పెట్టుకోవాలని అధికారుల సూచన
- రెండోరోజు సంగారెడ్డి జిల్లాలో అక్కడక్కడ రసాభాస
- మెదక్ జిల్లాలో చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతం

సంగారెడ్డి టౌన్/మెదక్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు రెండో రోజైన బుధవారం మెదక్ జిల్లాలో చెదురుముదురు సంఘటనలు మినహా సజావుగా సాగగా, సంగారెడ్డి జిల్లాలో అక్కడక్కడ రసాభాస నెలకొన్నది. అర్హుల ఎంపిక పట్ల గ్రామస్థుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు నచ్చచెబుతున్నారు. మరో రెండురోజుల పాటు గ్రామసభలు కొనసాగనున్నాయి.

సంగారెడ్డి జిల్లాలో

సంగారెడ్డి జిల్లాలో కొన్ని చోట్ల లబ్ధిదారుల జాబితాను చదవగా అర్హులైన వారి పేర్లు లేవంటూ గ్రామస్థులు అధికారులను నిలదీశారు. అక్కడక్కడ నిరసనలు చోటు చేసుకున్నాయి. మరికొన్ని చోట్ల ఇందిరమ్మ కమిటీల్లో అధికార పార్టీకి చెందిన వారి పేర్లను మాత్రమే చేర్చారంటూ బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురిలు పాల్గొన్నారు. ఆయా గ్రామసభల్లో ప్రభుత్వ పథకాల కోసం తమ పేర్లను చేర్చాలంటూ దరఖాస్తులు ఇచ్చేందుకు కౌంటర్ల వద్దకు ప్రజలు తరలివచ్చారు. బుధవారం జరిగిన గ్రామసభల్లో సంగారెడ్డి జిల్లాలో మొత్తం 25,833 దరఖాస్తులు అందాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 16,546 దరఖాస్తులు రాగా, అర్బన్ ప్రాంతాల్లో 9,287 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 646 గ్రామ పంచాయతీల్లో రేషన్‌కార్డుల కోసం 11,943, ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,456, రైతు భరోసా కోసం 332, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 815 దరఖాస్తులు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలోని 8 మునిసిపాలిటీల్లో మొత్తం 9,287 దరఖాస్తులు రాగా, రేషన్‌కార్డుల కోసం 6,033 దరఖాస్తులు, ఇళ్లకు 3,260 దరఖాస్తులు, రైతు భరోసా కోసం 20, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం నాలుగు దరఖాస్తులు వచ్చాయి.

- సంగారెడ్డి మండలం ఫసల్‌వాదీలో సంగారెడ్డికి సంబంధించిన డంపుయార్డును తొలగించాలంటూ గ్రామస్థులు సభను బహిష్కరించడంతో అధికారులు వెనుదిరిగారు.
- గుమ్మడిదల గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేర్లు లేవంటూ గ్రామస్థులు నిరసన తెలిపారు.
- చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో

మిగతా 6వ పేజీలో

స్థలం లేని వారికి 'డబుల్' ఇళ్లు ఇచ్చేందుకు కృషి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నర్సాపూర్‌లో నిర్వహించిన సభలో తమ పేర్లు లేవని కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో మొర పెట్టుకుంటున్న మహిళలు

నర్సాపూర్/మెదక్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు ఖాళీ స్థలం కూడా లేకపోతే, వారికి అర్హత ఉంటే నర్సాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇచ్చేందుకు కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఆరో వార్డులో నిర్వహించిన సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ సభలు ఏర్పాటు చేసిందన్నారు. ఎవరూ ఆందోళన చెందకుండా సభలోనూ దరఖాస్తు చేసుకోవచ్చని, తర్వాత మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రంలోనూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిపై విచారణ చేసి అర్హత ఉంటే కచ్చితంగా న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, తహసీల్దార్ కె.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు, వైస్‌చైర్మన్ నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలింతలు, పిల్లల వార్డులను సందర్శించి వారితో మాట్లాడారు. ఇష్టానుసారంగా వార్డులలోకి వస్తే రోగులకే ఇబ్బంది కలుగుతుందని, నిర్ధేశించిన సమయంలోనే వచ్చేలా సిబ్బందితో పాటు రోగులు జాగ్రత్త తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు నిరంతర ప్రక్రియ

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

పుల్‌కల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. చౌటకూర్ మండలం బద్రిగూడెంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని సూచించారు. ఆయా పథకాలకు అర్హులైన లబ్ధిదారులు గ్రామసభల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోని పక్షంలో మండల పరిషత్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులందరూ జాగ్రత్తగా అర్హుల ఎంపిక ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో పాండు, ఇన్‌చార్జి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, ఏవో ప్రవీణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బద్రిగూడెంలో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతికి మొర పెట్టుకుంటున్న వృద్ధ దంపతులు

పింఛన్ ఇప్పించండమ్మా!

ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన చిలిపిచెట్టి అలివేలమ్మ, రాములు తమను ఆదుకునే వారు లేక దుర్భరమైన జీవనం వెళ్లదీస్తున్నామని, కనీసం వృద్ధాప్య పింఛన్ అయినా ఇప్పించాలంటూ కలెక్టర్ క్రాంతిని వేడుకున్నారు. వృద్ధ దంపతులకు ఓ కుమారుడు ఉండగా, అనారోగ్యంతో ఇరవై ఏళ్ల క్రితమే మృతిచెందాడు. అప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం బద్రిగూడెం గ్రామానికి కలెక్టర్ వస్తున్నారన్న విషయం తెలుసుకున్న వారు ఉప్పరిగూడెం నుంచి వచ్చారు. కలెక్టర్ గ్రామసభను ముగించుకుని వెళుతండగా రాములు, అలివేలమ్మ వాహనానికి ఎదురుగా వెళ్లి రెండు చేతులతో దండం పెడుతూ పింఛన్ ఇప్పించాలని ప్రాథేయపడ్డారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆర్డీవో, తహసీల్దార్‌తో మాట్లాడి వృద్ధ దంపతుల్లో ఒకరికి పింఛన్ మంజూరు చేసేందుకు దస్త్రం సిద్ధం చేయాలని ఆదేశించారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్.. కోతలకు చెక్!

- టీజీఎస్పీడీసీఎల్ ముందస్తు ప్రణాళిక
- అధికలోడ్ మేరకు సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు
- 13 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- ఆరు మండలాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణం
- మెదక్ సర్కిల్‌లో రూ.25 కోట్లతో పనులు



మెదక్‌లోని 132కేవీ స్టేషన్

మెదక్ అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో విద్యుత్ సమస్యలు ఎదురుకాకుండా.. ఇప్పటి నుంచే అధికారులు అప్రమత్తమయ్యారు. డిమాండ్ మేరకు నిరంతర సరఫరా చేసేందుకు టీజీఎస్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. గతేడాది డిమాండ్ దృష్ట్యా ఈ ఏడాదిలో పెరిగిన విద్యుత్ సర్వీస్ ప్రకారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశారు. డివిజన్ల వారీగా డిమాండ్, సరఫరాను లెక్కించి రాబోయే వేసవిలో ఎంత మేరకు అవసరముందో అంచనాకు వచ్చి ఈ మేరకు ఏయే ఏర్పాట్లు చేయాలో గుర్తించారు. అంతరాయాలు తగ్గించేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తున్నారు. అత్యవసర సర్వీసులైన ఆసుపత్రులు, మెడికల్ కళాశాల, పోలీసుస్టేషన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. మున్సిపాలిటీల్లో విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు అంతరాయాలు లేకుండా ఉండేందుకు వ్యవస్థను పటిష్ట పరుస్తూ..11 కేవీ ఫీడర్లకు ప్రత్యామ్నాయ ఫీడర్లు ఏర్పాటు చేశారు. మెదక్ సర్కిల్‌లో రూ.25 కోట్లతో ప్రత్యేకంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. కొన్ని ప్రాంతాల్లో అధిక లోడ్‌భారం పడి తరచూ కాలిపోతున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 12 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నారు. పాతూర్, ఝూన్సీలింగాపూర్, ముప్పిరెడ్డిపల్లి, శభాష్‌పల్లి, జప్తిశివునూర్, మెదక్, నర్సాపూర్ సబ్‌స్టేషన్లలో 5 మెగావాట్లవి 6, 12.5 మెగావాట్లవి 6 ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు 25, 63, 100, 160 కేవీ సామర్థ్యం కలిగిన 170 ట్రాన్స్‌ఫార్మలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే స్థలాల సేకరణ, టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.5.50 కోట్లు కేటాయించారు. దాదాపు 24 కోట్లతో కొత్తగా మెదక్, చల్మెడ, బాలనగర్, వెంకటాయిపల్లి, చండూర్, మహ్మద్‌నగర్, మిర్జాపల్లిలో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. రెండు, మూడు నెలల నిర్మాణం పూర్తి అందుబాటులోకి తెచ్చేవిధంగా ప్రణాళికలు రూపొందించారు.

పాఠశాలలకు వరం 'పీఎంశ్రీ'

- బడుల్లో మౌలిక వసతుల కల్పన
- సాంకేతిక, సామాజిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన
- సంగారెడ్డి జిల్లాలో రెండు దశల్లో 44 పాఠశాలలు ఎంపిక



పీఎంశ్రీకి ఎంపికైన మాయికోడ్ పాఠశాల

నారాయణఖేడ్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే పటిష్ఠమైన విద్యతో పాటు సాంకేతిక, సామాజిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్‌ఇండియా) పథకం వరంలా మారనుంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి, రెండు దశలో 794 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మొదటి దశలో 25, రెండో దశలో 19పాఠశాలలను ఎంపికయ్యాయి. ఆయా పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత పాఠశాలస్థాయి వరకు కొన్ని గురుకుల జూనియర్ కళాశాలలను కూడా ఎంపిక చేశారు. ఇంటర్‌వరకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వివిధ కార్యక్రమాలను చేపట్టడానికి ఐదు సంవత్సరాలకుగాను దాదాపు రూ. కోటి నుంచి 2.5 కోట్ల ఖర్చు చేయయనున్నారు.

సైన్స్, డిజిటల్ ల్యాబ్‌లు, మౌలిక వసతులు, గ్రీనరీని చేపట్టనున్నారు. చైర్మన్‌గా హెడ్‌మాస్టర్, కన్వీనర్‌గా సైన్స్ లేదా పీఈటీ, సోషల్ టీచర్‌లలో ఎవరో ఒకరు ఉంటారు. ఏకో ప్రెసిడెంట్‌గా ఒక విద్యార్థితో పాటు నలుగురు సభ్యులలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు, పాఠశాలలో ప్రత్యేక ఆహ్వానితులుగా స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఉంటారు. ఈ పాఠశాలల్లో ఏకో క్లబ్‌లను ఏర్పాటు చేసి, సెమినార్స్, క్విజ్‌పోటీలు, ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు వినియోగించకుండా అవగాహన, క్షేత్రస్థాయి సందర్శనలు, వన మహోత్సవాలు, ర్యాలీలు, వివిధ ఉత్సవాలకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహించడం, వృషభ వందన్, సేంద్రియ ఎరువులపై అవగాహన, వర్షపు నీటి వినియోగం, స్కూల్ పరిసరాలను అందంగా తీర్చిదిద్దడం, పరిశుభ్రమైన వాతావరణం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, ఫార్మేషన్ కిచెన్, గార్డెన్ వంటి కార్యక్రమాలు చేపడతారు. పాఠశాల పరిసరాల్లో దేశభక్తులతో పాటు జాతీయ నాయకులు, సామాజిక వేత్తల చిత్రాలు వేయించడం, పర్యావరణం ఉట్టి పడే విధంగా చెట్ల పెంపకం కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలకు ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. దశల వారీగా కార్యక్రమాలకు నిధులను మంజూరు చేయనున్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్‌లో నిర్వహించిన ర్యాలీలో
కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జూనియర్ కళాశాల నుంచి రాందాస్ చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైందని, రోడ్డు భద్రతా నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటస్వామి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎంవీఐ విజయలక్ష్మి, ఏఎంవీఐలు శ్రీలేఖ, శ్రీనివాస్, ఎంఈవో నీలకంఠం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం మహిళల కోసం లైసెన్స్ మేళా

● జిల్లా రవాణా శాఖాధికారి వెంకటస్వామి

మెదక్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాలు, రానున్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ప్రతీ శుక్రవారం మహిళల కోసం లైసెన్స్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి వెంకటస్వామి తెలిపారు. ఈ నెల 24 నుంచి మార్చి 8వ తేదీవరకు ప్రతి శుక్రవారం లైసెన్స్ మేళా ఉంటుందన్నారు. లెర్నింగ్ లైసెన్స్ కోసం స్లాట్ బుక్ చేసుకొని అవసరమైన ధ్రువపత్రాలు, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఒరిజినల్స్ తీసుకొని కార్యాలయానికి రావాలన్నారు. 18 ఏళ్లు నిండి వాహనాలు నడిపే యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

ప్రజలను మభ్య పెట్టేందుకే గ్రామసభలు

● ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

గుమ్మడిదల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను మభ్య పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తున్నదని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. బుధవారం గుమ్మడిదల మండల కేంద్రానికి వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలంటూ ఏకంగా ఆ పార్టీ ఎమ్మెల్యే ప్రకటించడంతోనే ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో తేటతెల్లమైందన్నారు. ప్రజాపాలనంటే ఇదేనా సీఎం అంటూ ప్రశ్నించారు. ఎన్నికల హామీ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేని కాంగ్రెస్‌కు పాలించే నైతిక అర్హత లేదన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై కేసులు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా బీఆర్ఎస్ ప్రజల అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జిన్నారం వెంకటేశం గౌడ్, సీనియర్ నాయకులు దేవేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, తుపాకుల రాజు, ఆంజనేయులు యాదవ్, వాసు దేవ రెడ్డి, అమ్మగారి సదానందరెడ్డి, జైపాల్ రెడ్డి ప్రవీణ్ రెడ్డి, పెంటయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఒడిశా బృందం



తూప్రాన్ ఆస్పత్రిలో వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఒడిశా బృందం

తూప్రాన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఒడిశా బృందం సందర్శించింది. హైదరాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్, పురుషోత్తం ఆధ్వర్యంలో సందర్శించి నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాల అమలును పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, ఆరోగ్య శ్రీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తూప్రాన్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌సింగ్ వారికి వైద్య సేవల తీరును వివరించారు. ఒడిశా బృందంలో వైద్యులు అరవిందిండా, గోవింద మహంతి, రాబి నారాయణ్ సాహు, ఇప్సితా మహాపాత్ర, మనుశ్రీ, దీప్తి రాంకర్ మాలిక్, దీపక్ మాజీ తదితరులు పాల్గొన్నారు.

శోధిస్తూ.. సాధిస్తూ..

తమ చదువులో భాగంగా ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలు, ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నారు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. జిజ్ఞాస అనే ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా విద్యార్థులు సబ్జెక్టులవారీగా పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ విద్యార్థులు ప్రజలకు మేలు కలిగించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వారు ఎంచుకున్న అంశానికి సంబంధించి శాంపిల్స్ సేకరించి పకడ్బందీగా పరిశోధన చేపడుతూ కొత్త విషయాలను కనుగొంటున్నారు. చిన్న చిన్న విషయాలను సైతం క్షుణ్ణంగా పరిశీలించి ఉత్తమ ఫలితాలను రాబడుతున్నారు. తాజాగా ఈ కళాశాల విద్యార్థులు టూత్ బ్రష్‌పై పెద్ద రిసెర్చే చేశారు. వంద శాంపిళ్లు సేకరించి పరిశీలించారు. బ్రష్ సరిగ్గా వాడకపోయినా, శుభ్రం చేయకపోయినా వాటి ద్వారా బాక్టీరియా వ్యాప్తి జరుగుతుందని గుర్తించారు. ఆ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల వినూత్న కార్యక్రమం
- 'జిజ్ఞాస' ప్రాజెక్టులో భాగంగా పరిశోధనలు
- రోజూ వాడే టూత్ బ్రష్‌పై రీసెర్చ్
- కనిపించిన బ్యాక్టీరియా.. నివారణ జాగ్రత్తలపై సూచనలు, సలహాలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మనం ప్రతీ రోజు ఉదయాన్నే నిద్రలేవగానే బ్రష్ చేసుకొందే దినచర్య ముందుకు కదలదు. సాధారణంగా బ్రష్ చేసుకోవడానికి టూత్ బ్రష్, టూత్‌పేస్టు మీదనే ఆధారపడతాం. పల్లెటూర్లలో కొంత మంది వేప పుల్లలు వినియోగిస్తారు. కానీ ఎక్కువగా టూత్ పేస్టు, టూత్ బ్రష్ ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పళ్లను శుభ్రం చేసే టూత్ బ్రష్‌ను కూడా తరుచుగా శుభ్రం చేయాలని, లేకపోతే కొత్త సమస్యలు వస్తాయంటున్నారు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. టూత్ బ్రష్ హైజీన్, శానిటైజేషన్ పద్ధతులపై వారు ఇటీవల అధ్యయనం చేపట్టారు. 100 టూత్ బ్రష్‌ల నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించారు. అన్ని శాంపిల్స్‌లో స్టెప్టో కోకస్, స్టెఫైలకు, ఎస్చిషియాకూలి వంటి బాక్టీరియా వృద్ధి కనిపించింది. బాక్టీరియా వల్ల పలు దంత సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమస్యలు రాకుండా ఉండటానికి తరుచుగా మనం వాడే టూత్ బ్రష్‌ను శానిటైజ్, లేదా వేడి నీళ్లతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. బ్రష్ చేసుకున్న వెంటనే కాసేపు ఎండలో పెట్టిన తర్వాత క్లోజర్‌తో ప్యాక్ చేసి పెట్టాలన్నారు. ప్రతి 3 నుంచి 4 నెలలకు ఒకసారి బ్రష్ మార్చాలని సూచిస్తున్నారు. బ్రష్ వాడకంపై ప్రజల్లో ఉన్న అవగాహన తెలుసుకోవడానికి సర్వే కూడా నిర్వహించారు. మైక్రోబయాలజీ విభాగధిపతి మదన్ మోహన్ పర్యవేక్షణలో జరిగిన ఈ సర్వేలో పాల్గొన్న జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ విద్యార్థులు మౌనిక, సుస్మిత శరన్, సిద్ద, స్నేహ, నాగలక్ష్మిని ప్రిన్సిపాల్ సునీత, ఆధ్యాపక బృందం అభినందించింది.



బ్రష్‌పై అధ్యయనం చేసిన విద్యార్థులు, అధ్యాపకుడు



పరిశోధన చేస్తున్న విద్యార్థినులు

అవగాహన అవసరం

చాలా మంది గొంతు, దంత సమస్యలతో బాధ పడుతుంటారు. వీటికి వివిధ కారణాలున్నప్పటికీ ముఖ్యమైన కారణం టూత్‌బ్రష్ అని తెలియదు. మా ప్రాజెక్ట్‌లో బాగంగా దాదాపు 500 మందితో ఇంట్రాక్ట్ అయ్యాం. అందులో 80 శాతం మంది బ్రషింగ్ అవగాహన లేదు. టూత్ బ్రష్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుంటారు. బ్రషింగ్ తర్వాత కంటైనర్‌లో మాత్రమే పెట్టాలి. నెలల తరబడి బ్రష్‌లను వాడుతుంటారు. అలా చేయకూడదు. మౌత్ వాష్ కూడా తప్పనిసరిగా యూస్ చేయాలి.

-డా. మదన్ మోహన్, సూక్ష్మ జీవశాస్త్ర విభాగాధిపతి

ఈ ప్రాజెక్ట్ ద్వారా కొంత మార్పువచ్చినా చాలు

మనం నిత్యం పాటించే దినచర్యలో ఇదొక్క భాగం. చాలామందికి ప్రాపర్‌గా బ్రషింగ్ చేయటం తెలియదు. చిన్న విషయంగా కనిపించినా కూడా దంత సమస్యలు వస్తాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రజల్లో అవగాహన వస్తే మాకు సంతోషం. చాలా మందికి బ్రష్ చేసే విధానం తెలియదని మేం చేసిన సర్వేలో వెల్లడైంది. దీని వల్ల గొంతు, దంత సమస్యలు వస్తాయి. జాగ్రత్తలు పాటించకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయి. మా ప్రాజెక్ట్ వల్ల అవేర్‌నెస్ వస్తే బాగుంటుంది.

-మౌనిక, సుస్మిత, విద్యార్థినులు

చెరకు పంట, లారీ దగ్ధం



కాలి బూడిదగా మారిన చెరకు పంట

జహీరాబాద్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లిలో మంగళవారం జరిగిన షార్టుసర్క్యూట్‌తో 40ఎకరాల్లో చెరకుపంట కాలిపోయిన ఘటన మరువక ముందే బుధవారం అదే మండలంలోని గౌసాబాద్‌కు చెందిన సంజీవరెడ్డి అనే రైతు తన పొలంలో గల చెరకు పంటను లారీలో నింపుతున్న క్రమంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతూ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో లారీ, చెరకు, డ్రిప్‌పైపులు కాలిపోయాయి. రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేశారు. పొలాలపై వేలాడుతున్న తీగలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని, ఈ ప్రమాదాలకు వారే కారణమని, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

రూ. 94లక్షల విలువైన మత్తుపదార్థాలు ధ్వంసం

నర్సాపూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఎండుగంజాయి, డైజోఫాం, అల్ప్రాజోలం తదితర మత్తు పదార్థాలను అధికారులు ధ్వంసం చేశారు. రూ.94లక్షల విలువగల వాటిని బుధవారం నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ సమీపంలోని బయో పరిశ్రమలో ధ్వంసం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెదక్, రామాయంపేట, నర్సాపూర్ ఎక్సైజ్ సీఐలు నాగేశ్వరరావు, రాణి, పద్మ, ఎస్ఐలు రాజేష్, మాన్సింగ్, రాఘవేందర్‌రావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.



మత్తుపదార్థాలను ధ్వంసం చేస్తున్న అధికారులు



రావి ఆకుపై సుభాష్ చంద్రబోస్ చిత్రం

నారాయణఖేడ్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):ఈ నెల 23న నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి ఉంది. దీన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకుపై చంద్రబోస్ చిత్రాన్ని ఆకట్టుకునే విధంగా వేసి పలువురిని అబ్బుర పరిచాడు.

ఒక్కరే విద్యార్థి.. ఒక్కరే ఉపాధ్యాయుడు

● గౌడ్‌గాం జన్‌వాడ పాఠశాలను తనిఖీ చేసిన మండల ప్రత్యేక అధికారి

నాగల్‌గిద్ద, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడ్‌గాం జన్‌వాడ ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల ప్రత్యేక అధికారి బలరాం, ఇన్‌చార్జి తహసీల్దార్ శివక్రిష్ణ స్థానిక ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒక్కరే విద్యార్థి, ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంతో అధికారులు ఆశ్చర్యపోయారు. స్థానిక ఉపాధ్యాయులను అధికారులు అడుగగా గ్రామంలో విద్యార్థులు లేరని తెలుపడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. దీంతో అధికారులు మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కాగా కేశ్వార్‌లో గల ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో మన్మథకిషోర్ తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.



పాఠశాల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి

క్రైం కార్నర్

పరిశ్రమలో ఊపిరాడక కార్మికుడి మృతి



మనోజ్ మృతదేహం

జిన్నారం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో ఊపిరాడక కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గడ్డపోతారంలో నివాసం ఉండే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ (28) ఈ నెల 21న స్థానికంగా ఉన్న లీఫార్మా పరిశ్రమలో మధ్యాహ్నం (బి షిఫ్ట్) విధులకు వెళ్లాడు. రాత్రి 8:30గంటల ప్రాంతంలో పనిలో ఉండగా ఊపిరాడక అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన పరిశ్రమ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి తన నివాసం వద్ద దింపి వెళ్లారు. రాత్రి 10గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబసభ్యులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా.. మృతి చెందాడు. మృతుడి సమీప బంధువు చంద్రకేశవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు..

దుబ్బాక,జనవరి22(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిన్ననిజాంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రంజిత్(33) మంగళవారం సాయంత్రం పోతరెడ్డిపేట పెద్దవద్ద కాళ్లకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలుజారి చెరువులో పడి మృతిచెందాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా చెరువు వద్ద బైక్, చెప్పులు కనబడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తును చేస్తున్నారు.

వంటమనిషి ఆత్మహత్య

ఐడీఏబొల్లారం జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఒంటరితనాన్ని భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిస్సా ప్రాంతానికి చెందిన భాస్కర్‌రావు (36) బొల్లారంలో నివాసం ఉంటూ బాలాజీ హోటల్‌లో వంటమనిషిగా పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులను వదిలి ఒంటరిగా నివాసం ఉంటున్న అతడు మద్యానికి బానిసగా మారారు. కుటుంబంతో పెద్దగా సంబంధాలు లేకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బాబాయ్ బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆగని హైనా దాడులు

ధూళిమిట్ట, జనవరి22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూటిగల్ గ్రామంలో పశువులపై హైనా దాడులు ఆగడం లేదు. మంగళవారం రాత్రి వ్యవసాయ బావి వద్ద పొన్నం రాజుకు చెందిన గేదె దూడపై హైనా దాడి చేయడంతో మృతిచెందింది. బుధవారం ఉదయం గమనించిన రైతులు అధికారులకు సమాచారం అందించగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాముడు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. రాత్రి వేళల్లో పశువులను ఇళ్ల వద్ద కట్టేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

మల్లన్నను దర్శించుకున్న టీజీఎస్‌పీడీసీఎల్ సీజీఎం

చేర్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాన్ని బుధవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీజీఎం సాయిబాబా సందర్శించారు. ఈ సందర్భంగా మల్లన్నను దర్శించుకుని అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌పై నిఘా

● ప్రతీ ప్రయోగశాలలో సీసీ కెమెరాలు

● ఫిబ్రవరి 3 నుంచి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈ సారి మరింత పకడ్బందీగా నిర్వహించడంపై తెలంగాణ ఇంటర్ బోర్డు దృష్టి సారించింది. ఫిబ్రవరి 3 నుంచి 20 రోజుల పాటు జరిగే ఈ పరీక్షలపై నిఘాను పటిష్టం చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య జిల్లాల్లోని ఇంటర్మీడియట్ అధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు కూడా జారీ చేశారు.



కమాండ్ కంట్రోల్‌కు కెమెరాల అనుసంధానం

ప్రాక్టికల్స్ నిర్వహించే గదుల్లో రెండేసి చొప్పున వీడియోతో పాటు వాయిస్ రికార్డింగ్‌తో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. ఈ కెమెరాలను ఇంటర్ బోర్డులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడి నుంచే పరీక్షల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. జిల్లాలో సుమారు 10 వేల మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతారు. ప్రశ్నాపత్రం ఏ రోజుకారోజు ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్‌లో వస్తుండగా.. దాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రింట్ తీసుకొని విద్యార్థులకు అందిస్తారు. అక్రమాల నిరోధానికి మునుపెన్నడూ లేని విధంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో పలు కళాశాలల యాజమాన్యాలు ఆగమేఘాల మీద సీసీ కెమెరాల బిగింపు, ప్రాక్టికల్ పరికరాలు, రసాయనాలు తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

బోర్డు ఆదేశాలు పాటించాల్సిందే



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలపై ఈ సారి బోర్డు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ కళాశాలలేవరైనా ప్రతీ ల్యాబ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిందే. ప్రతీ సీసీ కెమెరాపై బోర్డు ఉన్నతాధికారుల నిఘా ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాలను ప్రతి కళాశాల యాజమాన్యాలు పాటించాలి.

-గోవిందరామ్, డీఐఈవో, సంగారెడ్డి

131 జూనియర్ కళాశాలలు

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 131 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 20 ప్రభుత్వ, 48 ప్రైవేటు, 63 ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. వీటన్నింటిల్లో విధిగా సీసీ కెమెరాలు అమర్చాల్సి ఉంది. ఇప్పటికే గత డిసెంబరు నెలలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణలో బాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరికరాలు, రసాయనాలు కొనగోలుకు ఒక్కో కళాశాలకు రూ.25 వేల చొప్పున మంజూరయ్యాయి. అదేవిధంగా ప్రతీ కళాశాలకు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 12 వేల నిధులు కూడా కేటాయించింది. ఇక కొన్ని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ బోర్డు అధికారులే సీసీ కెమెరాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

న్యూస్ బాక్స్

రాయసముద్రం చెరువులోకి మురుగు ప్రవాహం



చెరువులోకి చేరుతున్న మురుగు

రామచంద్రాపురం టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి రామచంద్రారెడ్డినగర్ కాలనీ సమీపంలోని రాయసముద్రం చెరువులోకి కాలనీవాసుల మురుగు ప్రవాహం చేరుతోంది. 98 ఎకరాల్లో ఉన్న చెరువులోకి మురుగు చేరడంతో పర్యాటక కళ కోల్పోతోంది. నిత్యం పక్షులతో అలరారిన చెరువులోకి మురుగు చేరి కంపు కొడుతోంది. గుర్రపుడెక్క తొలగించిన తరువాత దాన్ని చెరువులోనే కుప్పలుగా అలానే వదిలిపెట్టారు.

కోర్టు గ్రంథాలయానికి నూతన చట్టాల పుస్తకాలు

సంగారెడ్డి క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నూతన క్రిమినల్ మేజర్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యముల చట్టాలు, భారత రాజ్యాంగం నూతన పుస్తకాలను సంగారెడ్డి జిల్లా కోర్టులోని గ్రంథాలయానికి సంగారెడ్డికి చెందిన న్యాయవాది నిజామొద్దీన్ రషీద్ బార్ అసోసియేషన్ గ్రంథాలయ కార్యదర్శి ఆంజనేయులకు బుధవారం అందజేశారు.

దంపతులకు నివాళులు

పటాన్‌చెరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పటాన్‌చెరుకు చెందిన దంపతులు సందీప్‌షా, అంజలి మృతదేహాలకు బుధవారం అంతిమ వీడ్కోలు పలికారు. ఉత్తరభారతదేశ సంక్షేమ సంఘంలో సందీప్‌షా చురుకుగా పాల్గొనేవాడు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి దంపతుల మృతదేహాలకు నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : నేడు తెల్లాపూర్ మున్సిపాలిటీ ఎంఐజీ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శివశంకర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ ఉండదని, ఏబీ కాలనీ, ఇందిరానగర్, తెల్లాపూర్, జేపీకాలనీ, మైఫేయిర్ రోడ్డు, వాసుదేవ్‌బ్లూమ్స్ ప్రాంతాల ప్రజలు గమనించాలని తెలిపారు.

రాజ్యాంగాన్ని గౌరవించేది బీజేపీ మాత్రమే: శ్రీనివాస్

మెదక్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని గౌరవించేది బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సంవిధాన్ గౌరవ అభియాన్‌లో భాగంగా బుధవారం దళితవాడలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

శివ్వంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామసభ ఫ్లెక్సీలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు ఫొటోలు పెట్టకుండా, ప్రోటోకాల్ పాటించకుండా కించపరిచారని ఫ్లెక్సీ చింపిన ఘటనలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై పోలీసులు మంగళవారం నమోదు చేసిన కేసులకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.

నో ఇన్‌కమింగ్.. ఓన్లీ అవుట్ గోయింగ్!

- అల్లాదుర్గం ట్రాన్స్‌కోలో కీలక పోస్టులన్నీ ఖాళీ
- పట్టించుకోని జిల్లా అధికారులు
- భర్తీ చేయాలంటూ ప్రజల వినతి



అల్లాదుర్గంలోని ట్రాన్స్‌కో కార్యాలయం

అల్లాదుర్గం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న అల్లాదుర్గంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో అధికారుల కొరత వేధిస్తోంది. ఇక్కడికి వచ్చిన అధికారులు అవుట్ గోయింగే.. కానీ ఇన్‌కమింగ్ రావడం లేదు. నిత్యం ఏదో ఒకచోట విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్న నేపథ్యంలో మండల ట్రాన్స్‌కో కార్యాలయంలోని కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండడం పలు విమర్శలకు తావిస్తోంది. రెండు, మూడు గ్రామాలకు ఒక జేఎల్ఎంతో పనులు చేయిస్తున్నారు. ఈ కార్యాలయంలోని కీలకపోస్టులైన ఏఈ పోస్టుతో పాటు సబ్ ఇంజనీర్ పోస్టు కూడా నాలుగు నెలలుగా ఖాళీగా ఉన్నది. అలాగే రెండేళ్లుగా లైన్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఏఈగా విధులు నిర్వహించిన శివాజీ అక్టోబరులో ట్రాన్స్‌కోకు రాజీనామా చేసి నీటిపారుదల శాఖకు వెళ్లిపోగా.. సబ్ ఇంజనీర్ నవాజ్ పెద్దశంకరంపేట మండలానికి బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిస్థానంలో ఇతరులను నియమించకపోవడంతో రెండునెలలుగా ఈ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు మండల ప్రజలు తెలియజేస్తున్నారు. మండలంలో ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా.. ఒక్కరిని నియమించారు. మరో పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నది. మండలంలో తరచూ జరుగుతున్న విద్యుత్ అంతరాయంపై ఆయా గ్రామాల ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఈ ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏర్పడిన కీలక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట: ఎమ్మెల్యే



తెల్లాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.17.82 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన మూడు మున్సిపాలిటీలను రికార్డుస్థాయిలో అభివృద్ధి పరిచామన్నారు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. ఐదేళ్లలో తెల్లాపూర్ మున్సిపాలిటీని రూ.220 కోట్ల రికార్డు స్థాయి నిధులతో అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అయితే లెల్లాపూర్‌లో ముఖ్యమైన ఫంక్షన్‌హాల్ ప్రారంభోత్సవం పనులు పూర్తికాకపోవడంతో వాయిదాపడింది. జర్నలిస్టులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ఓ దినపత్రిక విలేకరి కుమారుడు ఇసుమంత్‌రాజు బీటెక్ (3వ సంవత్సరం) తనకు కలిగిన అనారోగ్య సమయంలో జీఎంఆర్ తన సొంత నిధులతో అందించిన హెచ్‌డీఎఫ్‌సీ ఈఆర్‌జీవోఆరోగ్య భీమా ద్వారా రెండు పర్యాయాలు కలిపి మొత్తం రూ.12.44 మంజూరు ఇవ్వడంతో ప్రాణాంతకరమైన వ్యాధి నుంచి బయటపడ్డట్టు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా విలేకరి కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కేతకీలో ఎమ్మెల్యేల పూజలు



ఎమ్మెల్యేలను శాలువాలు, పూలమాలలతో సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

ఝరాసంగం, జనవరి 22: (ఆంధ్రజ్యోతి) : దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోశ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారిచే అర్చకులు సంగమేశ్వరుడికి విశేష పూజలు జరిపించి, ఎమ్మెల్యేలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత ముందుకొస్తే మరిన్ని లైబ్రరీలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి



రామాయంపేట గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

రామాయంపేట/నర్సాపూర్/వెల్దుర్తి/శివ్వంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : యువత ముందుకొస్తే జిల్లాలో మరిన్ని గ్రంథాలయాల ఏర్పాటు తథ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం రామాయంపేటలోని గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో నడుస్తున్న 16 గ్రంథాలయాల్లో 4 అద్దె భవనంలో కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం రేగోడులో ఓ లైబ్రరీకి పక్కా భవన నిర్మాణం జరుగుతుందన్నారు. నర్సాపూర్ సమీపంలోని అర్బన్‌పార్కులో ఏర్పాటు చేస్తున్న కాటేజీలు త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయని సుహాసినిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తిలోని నూతన గ్రంథాలయ భవనాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత గ్రంథాలయంలోని పుస్తకాలను వారంరోజుల్లో కొత్త భవనంలోకి మార్చలని లైబ్రేరియన్ స్వామికి సూచించారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యాదగిరి, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. శివ్వంపేట మండల కేంద్రమైన శివ్వంపేటలో శాఖ గ్రంథాలయాన్ని సుహాసినిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఆమె వెంట జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, శివ్వంపేట లైబ్రేరియన్ అర్చన, నర్సాపూర్ లైబ్రేరియన్ యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎంత ఉత్సాహంగా వచ్చామో.. అంతే ఆవేదనతో వెళ్తున్నాం..

- మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్

రామాయంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయ పంథా ఎగరేసి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఐదేళ్ళ. మొదట్లో ఎంతో ఉత్సాహం కనబరిచాం.. కానీ ఆ పదవి నిరాశ, నిస్పృహలకు లోను చేసింది. ఆవేదనతో.. కుమిలి దిగిపోతున్నామన్నారు రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్. బుధవారం పాలకవర్గ వీడ్కోలు సమావేశానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి, కమిషనర్ దేవేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 12 మంది కౌన్సిలర్లను సత్కరించారు. ఈ సందర్భంగా జితేందర్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఊహించిన స్థాయిలో పట్టణ పురోభివృద్ధి జరగనందుకు ప్రజలను క్షమాపణలు కోరారు. దాదాపుగా రూ.60 కోట్ల పనులు ప్రభుత్వం మారడంతో నిలిచిపోయాయన్నారు. తమ హయాంలో రూ20 కోట్ల పనులు చేయగలిగాం. ఇంకా ఎన్నో నిర్మాణాలు అసంపూర్తి దశలో మిగిలిపోయాయన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు తరలించాలని గ్రామసభ బహిష్కరణ



ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

సంగారెడ్డి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న ప్రవేశపెట్టనున్న సంక్షేమ పథకాల కోసం అమలు కోసం నిర్వహించే గ్రామసభకు వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. సంగారెడ్డి మండలంలోని కల్పగూర్, కులబ్‌గూర్, ఫసల్‌వాది, గుడితండాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. సంగారెడ్డి మండలం పసల్‌వాదిలో ఎంపీడీవో యాదగిరిరెడ్డి గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో లేని పేర్లు చదువుతున్న క్రమంలో గ్రామస్థులు అడ్డుకుని తమ గ్రామంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన చెత్తను ఫసల్‌వాది గ్రామంలో ఎందుకు వేస్తున్నారని నిలదీశారు. దీనికి సమాధానంగా గ్రామసభలో డంపింగ్‌యార్డు సమస్యను తీసుకురావద్దని, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించినవి మాత్రమే ఇందులో స్వీకరిస్తామని ఎంపీడీవో తెలిపారు. అధికారుల సమాధానంతో ఏకీభవించని గ్రామస్థులు తమ గ్రామంలో నుంచి డంపింగ్‌యార్డును తరలించే వరకు గ్రామసభను నిర్వహించనీయమని బహిష్కరించారు. అధికారులు, పోలీసులు ఎంత నచ్చచెప్పాలని చూసినా వినకపోవడంతో చేసేది లేక అధికారులు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరిరెడ్డి, తహసీల్దార్ దేవదాస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీఈవో

కల్హేర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని జంలాతండాలో నిర్వహిస్తున్న పాఠశాలల క్రీడోత్సవాలను బుధవారం ఆయన ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యాభ్యాసంతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని, దీనికోసం పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా చర్యలు తీసుకుకోవాలని డీఈవో సూచించారు. అంతకుముందు లక్ష్మణ్‌తండా ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట సిర్గాపూర్ ఎంఈవో నాగారం శ్రీనివాస్, సీఆర్పీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

నిజాంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడి వెండి, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపైడి శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల రమేష్ మంగళవారం ఇంటికి తాళంవేసి పని నిమిత్తం బయటకు వెళ్లారు. తెల్లవారుజామున ఇంటికి వచ్చిన బాధితులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా.. బీరువా, బెడ్ రూమ్‌లోని దుస్తులు చిందరవందంగా పడి ఉన్నాయి. బీరువాలోని 48 తులాల వెండి ఆభరణాలు, రూ.13 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీమ్ ద్వారా పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్వాక్రా డబ్బులు గోల్‌మాల్

రామాయంపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట మండల పరిధి దామరచెర్వు మహిళా గ్రూపుల కిస్తీ డబ్బుల గోల్‌మాల్ కథ ముగిసింది. గ్రామంలో 30 డ్వాక్రా గ్రూపులుండగా.. 14 వాటిల్లో లక్షల్లో మోసం జరిగిందంటూ గత శుక్రవారం సభ్యులు ఊర్లో టెంట్ వేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ భీముడు వెళ్లి సదరు బ్యాంకు మిత్ర నుంచి రికవరీ చేస్తామని ఇచ్చిన హామీమేరకు బుధవారం ఆ డబ్బును రికవరీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి



మునిపల్లి: బుదేరా గ్రామసభలో మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఝరాసంగంలో నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల పరిధి బుదేరా గ్రామంలో నిర్వహించి ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిన్నారం మండలంలోని అండూర్, కాజీపల్లి, కొడకంచి, నల్తూరు, సోలక్‌పల్లి, వావిలాలలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు మండలం పాశమైలారం, నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని నాలుగువార్డుల్లోని గ్రామసభల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ పాల్గొన్నారు. రాయికోడ్ మండలం కర్చల్, మామిడిపల్లి, కోడూర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జీ.అంజయ్య, పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామంలో, గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం, రామిరెడ్డిబాయి, కానుకుంట, నల్లవల్లి గ్రామాల్లో, ఐడిఏబొల్లారం పురపాలక పట్టణ పరిధి లక్ష్మీనగర్, పాత గ్రామం, చర్చిబస్తీ, పారిశ్రామికవాడ ప్రాంతాల్లో వార్డుసభలను మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ప్రారంభించారు. మెదక్ జిల్లా ఝరాసంగం మండలం పోట్‌పల్లి గ్రామంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, హవేలిఘణపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో తహసీల్దార్ రేణుక, చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్, అంబాజీపేట, సూరారం, చందంపేట, శాలిపేట, మిర్జాపల్లి, కొర్విపల్లి, గవ్వలపల్లి, మడూర్, వెంకట్రావ్‌పల్లి, ధర్పల్లి, కామారం గ్రామాల్లో, రేగోడు మండలం దోసపల్లి, పోచారం, జగిర్యాల, ఆర్ఇటిక్యాల, గజవాడ, తాటిపల్లి గ్రామాల్లో నిర్వహించిన సభల్లో రాయికోడ్ పీఏసీఎస్ మెంబర్ కిషన్, మాజీ ఎంపీపీ దిగంబర్‌రావు, పెద్దశంకరంపేట, శివాయపల్లిలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, వెల్దుర్తి మండలం అరెగూడెం, దామరంచ, ధర్మారం, కుకునూర్, మేల్లూరు, ఉప్పులింగాపూర్, రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్, కౌడిపల్లి మండలం తిమ్మాపూర్, కోహీర్ మండలం దిగ్వాల్, కోహీర్, మనియార్‌పల్లి, మాచిరెడ్డిపల్లి, జహీరాబాద్ పట్టణంలోని రాంమందిర్, ఆర్యనగర్, బసవేశ్వర్‌వీధి, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాపాలనలో జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పాల్గొన్నారు.

అటు అర్హుల ఎంపిక.. ఇటు అర్జీలు

3వ పేజీ తరువాయి

రైతు భరోసా రూ.15 వేలు చెల్లిస్తామని చెప్పి... రూ.12 వేలు చెల్లించనున్నట్లు ప్రకటించడం ఏమిటని రైతులు అధికారులను నిలదీశారు.

- కోహీర్ మండలం దిగ్వాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు ఎందుకు లేవంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

మెదక్ జిల్లాలో

మెదక్ జిల్లాలో బుధవారం 21 వార్డులు, 156 గ్రామాల్లో సభలను నిర్వహించారు. వార్డు, గ్రామ సభలకు అర్జీదారులు పోటెత్తారు. జిల్లాలో పలు చోట్ల చెదురుముదురు సంఘటనలు మినహా రెండోరోజు గ్రామసభలు సజావుగా సాగాయి. గ్రామసభలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షించగా.. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కొన్ని చోట్ల మినహా అధికారులు వెల్లడించిన జాబితాకు గ్రామ, వార్డు సభలు ఆమోదం తెలిపాయి. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసినప్పటికీ తుది జాబితాలో తమపేర్లు లేకపోవడంతో అక్కడక్కడా నిరసనలు వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికలో కొన్ని తప్పులు దొర్లడం సాంకేతిక కారణాల వల్లనేనని అధికారులు సర్దిచెబుతున్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో నిర్వహించిన సభకు కలెక్టర్ రాహుల్‌రాజ్ హాజరుకాగా, పలువురు మహిళలు గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నామని, తీరా తుది జాబితాలో తమ పేర్లు లేవని ఆయనతో మొర పెట్టుకున్నారు. కలెక్టర్ స్పందిస్తూ అర్హులైన వారి కోసమే ఈ సభలు నిర్వహిస్తున్నామని, నిరాశ వద్దని.. పేర్లు రాని వారు మరోసారి అర్జీ పెట్టుకోవాలని సూచించారు.

- చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో, కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో గ్రామసభలో ప్రకటించిన జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తిమ్మాపూర్‌లో అర్హులకు పథకాలు అందడం లేదంటూ స్థానిక బీఆర్ఎస్ నేతలు అధికారులతో వాగ్వాదానికి దిగారు.
- తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామసభలో సంక్షేమ పథకాలు అనర్హులకే వర్తింపజేస్తున్నారని మహిళలు అధికారులను నిలదీశారు.
- వారం రోజులుగా నిజాంపేటలో రోడ్డు నిర్మించాలంటూ గ్రామస్థులు రిలే దీక్షలు చేపడుతుండగా, బుధవారం గ్రామసభలో నిరసనకారులు కార్యక్రమాన్ని జరగనివ్వకుండా దీక్షలు కొనసాగించారు.
- రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్‌లో గ్రామసభను అడ్డుకుని గంటసేపు గందరగోళం సృష్టించారు. పోలీసుల ప్రవేశంతో సభ కొనసాగింది.
- మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలో నిర్వహించిన గ్రామసభలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులకూ రైతుబంధు అమలు చేస్తున్నారు, అసలైన పేదల పేర్లు జాబితాల్లో ఉండడం లేదని నిరసన వ్యక్తం చేశారు.

పైపులైన్ సామర్థ్యం పెంపునకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్ జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మురుగు పారుదల పైపులైన్ సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉన్నదని కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధి మ్యాక్ సొసైటీ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. మురుగు లీకేజీలు పెరిగాయంటూ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఎంఐజీ రైల్వేస్టేషన్ సమీపంలో కల్వర్టు లేక వర్షాలు కురుస్తున్న ఇబ్బందులు ఉంటున్నాయని స్థానికులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం శివకృష్ణ, ఏఈ దివ్యతేజ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

- జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయకర్త పల్లవి

కంది/నారాయణఖేడ్/కౌడిపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బాలికలు బాలురతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయ కర్త పల్లవి అన్నారు. మిషన్‌శక్తి బేటీబచావో-బేటీపడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ, సాధికారత కేంద్ర ప్రతినిధులు మండల పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నారాయణఖేడ్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఆవరణలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళా సంక్షేమ శాఖ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి మాట్లాడారు. కౌడిపల్లి మండల పరిధి తునికిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నిర్వహించిన బేటి పడావో.. బేటి బచావో కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ మహిళా శిశు సంక్షేమ అధికారి జితేందర్ పాల్గొని మాట్లాడారు.

'కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా మారుతోంది'

నర్సాపూర్/శివ్వంపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో శివ్వంపేట మండలం పోతులబోగుడకు చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. వారు మాట్లాడుతూ ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సునీతారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వల్ల ఒక్క కులానికే లబ్ధి

- మాదిగ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పల్లె సంజీవయ్య

జోగిపేట/మెదక్ కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఫలాలను కొన్ని దశాబ్దాలుగా కేవలం ఒకే కులం అనుభవిస్తోందని, దీనివల్ల 59 ఉపకులాల వ్యక్తులు నష్టపోతూ అభివృద్ధి చెందడం లేదని మాదిగ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పల్లె సంజీవయ్య అన్నారు. బుధవారం ఆయన ఆందోలు పట్టణంలో నిర్వహించిన మాదిగ సమన్వయ కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం 59 ఉపకులాలకూ రిజర్వేన్ ఫలాలు దక్కాలన్నది అత్యంత ఆవశ్యకమైన విషయమన్నారు. ఇదిలా ఉంటే 'వేయి గొంతులు- లక్ష డప్పులు' కార్యక్రమానికి సన్నాహకంగా ఫిబ్రవరి 2న జోగిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, దీనికి నియోజకవర్గంలోని మాదిగలంతా హాజరుకావాలని సంజీవయ్య కోరారు. మాదిగల వేదనను వివరిస్తూ ఫిబ్రవరి 7న నిర్వహించే 'వెయ్యి గొంతులు, లక్ష డప్పుల' మహా ప్రదర్శన విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హస్తరుగళ్ల బాలరాజ్ అన్నారు. బుధవారం నిర్వహించిన గ్రామ కమిటీ సభలో మాట్లాడారు.

వైభవంగా శాంతప్ప మహరాజ్ ఉత్సవాలు

రేగోడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఇటిక్యాల గ్రామంలో శాంతప్ప మహరాజ్ ఆరాధనోత్సవాలు రెండురోజులు వైభంగా జరిగాయి. బుధవారం జరిగిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, జైపాల్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానం చేశారు. ఉత్సవాల్లో దుద్యాల సర్వేశ్వరపురం అంబికా శివయోగి స్వామీజీ, కౌలాస్ పీఠాధిపతి మల్లికార్జున శివాచార్య, మల్లన్న గుట్ట పీఠాధిపతి బసవలింగ అవధూతమహరాజ్ పాల్గొని ప్రవచనాలు చేశారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణం

జోగిపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జోగిపేట పట్టణంలోని సత్యసాయి మందిరంలో బుధవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజారి శ్రీనివాస్‌రావు ఈ కల్యాణాన్ని జరిపారు. అనంతరం, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీబీ నాగభూషణం, నాయకుడు చాపల వెంకటేశం పాల్గొన్నారు.